# అది సమస్య - ఇది పరిష్కారం



## సుదర్శనం

సముద్రం నురుగులు కక్కుతోంది. తెల్లటి కెరటాలు వచ్చి పాదాల్ని తాకిపోతున్నాయి. ఒక్కోసారి నేను పూర్తిగా తడిసి పోతున్నాను. అయినా నా కా ధ్యాసే లేదు. మనసు పరిపరివిధాల ఆలోచిస్తూంది. ఊర్మిళ ప్రెగ్నెంట్ అని డాక్టర్ చెప్పిన దగ్గిర నుంచీ నిలబడిన చోట నిలవకుండా కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నాను. ఏ కష్టం వచ్చినా నన్ను సాదరంగా ఆహ్వానించి సేద తీర్చే సముద్రుణ్ణి ఆశ్రయించినా, బంగారాన్ని కొలిమిలో కాల్చినట్లు నా మనస్సు మండిపోతూంది. ఊర్మిళ పయోముఖ విషకుంభం అని గ్రహించలేని నా మీద నాకే అసహ్యంగా ఉంది. ఆమెను మొదటి సారి చూసినప్పుడే నా గుండెలో గుడి కట్టి దేవతగా ఆహ్వానించేను. నా ఇంటిలో నా సహధర్మచారిణిగా ఆమె అడుగు పెట్టినప్పుడు ఈ ప్రపంచంలో నా అంత అదృష్టవంతుడు లేడని పొంగిపోయేను. నా బిడ్డలకు తల్లిగా ఆమెను ఎంతగా ఆరాధించేనో! కాని ... కాని, ఆమె ఇంత నీచురాలా! ఇంత కాముకురాలా! ఛీ! ఛీ! అందుకే ఆడదాన్ని పూర్తిగా ఎప్పుడూ నమ్మకు అన్నా రెవరో.

"నువ్వు ఆవేశపడకు. నూటికి ఒక వాసెక్టమీ కేస్ ఫైలు కావడం కద్దు. సెమెన్ రిపోర్టు వచ్చే వరకూ ఆమెను మాటలతో హింసించకు సుమా?" అన్నాడు డాక్టర్ చంద్రభాను. కాని, ఈ అగ్నిని మనస్సులో ఎలా ఇముడ్చుకోను? ఆమెతో ఒకే ఇంటి కప్పు క్రింద ఈ రాత్రంతా ఆవేశం లేకుండా ఎలా గడప గలను? సెమెన్ రిపోర్టు నెగటివ్‌గా వస్తే ఆమెను ఏం చెయ్యాలి? ఆమెకు ఏ శిక్ష విధించాలి? ...

డా॥ కె. సి. శకుంతలాదేవి

## చంద్రభాను

ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం ఉంటుం దంటారు. కాని ... కాని, ఇటువంటి క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు ఏ మగాడైనా స్థిమితంగా ఉండ గలడా? ఒడ్డున ఉండి ఎవరి కయినా ఎన్ని సలహాలయినా ఇవ్వవచ్చుకాని, నట్ట నడిసముద్రంలో కొట్టుకుపోతున్న వాడి పరిస్థితి ఎలా ఉంటుంది? నేను చేసిన ఆపరేషన్ సక్సెస్ కాకపోవడం అన్న ప్రశ్నే లేదు. సమర్థుడైన సర్జన్‌గా నా కా ఆత్మ విశ్వాసం ఉంది. కాని, మనసున్న మనిషిగా, ప్రాణాల్ని

రక్షించే డాక్టర్‌గా నేనేం చేయాలి? మగవాడు ఏదైనా భరిస్తాడు కాని, తన భార్య అపవిత్రురాలు కావడం భరించలేడు. చేతనయితే ఆమెను హత్య అయినా చేస్తాడు. లేకపోతే ఆత్మహత్య అయినా చేసుకుంటాడు. ఊర్మిళ ప్రెగ్నెంట్ అని చెప్పినప్పుడు అసలు సుదర్శనం ఆవేశాన్ని ఎలా అపుకున్నాడో నా కిప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది. ఆ కళ్ళలో ఎరుపుదనం చూసి పాపం! ఊర్మిళ ఎంత వణికిపోయిందని!

క్షణికావేశం ఎన్ని సమస్యల్ని సృష్టిస్తుందో క్షణ కాలం ఆలోచిస్తే ఈ ప్రపంచంలో ఏ మనిషి నేరస్థుడు కాలేడు. లోకంలో నేరాల్ని ఎలా మాపుచేయా అన్నది కాదు ఇప్పుడు సమస్య. సుదర్శనం సెమెన్ నెగెటివ్ అని నేనే చెప్పవలసి రావడం. వాళ్ళ కుటుంబంలో కలతలకు నే నే కారకుడిని కావడం నాకు ఇష్టం లేదు. ఏదో ఒకటి చెయ్యాలి. వాళ్ళ కుటుంబాన్ని కాపాడాలి. ఒక అబద్ధం, చిన్న అబద్ధం సుదర్శనం మనసులో పువ్వుల్ని పూయిస్తుంది. ఊర్మిళ ముఖంలో చిరునవ్వుల్ని శాశ్వతం చేస్తుంది. ఒక కాపురం నిలబడుతుంది. కాని, ఆ అబద్ధం నా ప్రాక్టీసుకు పెద్ద దెబ్బ. నా రెప్యుటేషనుకు కత్తి పేటు. ఒకవేళ నేను అబద్ధం ఆడి ఆమెను రక్షించినా, మళ్ళీ మళ్ళీ ఇటువంటి తప్పు చేయదని గ్యారంటీ ఏమిటి? నిజానికి ఒక పతితకు చేయూత నివ్వవలసిన అవసరం ఏమిటి? ఊర్మిళకు అన్యాయం జరిగితే నాకేం? ఇదే నా విజయ చేస్తే నేను భరించగలనా? అటువంటి స్త్రీ ఉండేకంటే చనిపోతేనే మంచిది. అవును. ఈ సమస్యకు పరిష్కారం నేను అబద్ధం ఆడడం కాదు. ఊర్మిళ పశ్చాత్తాపంతో ఆత్మహత్య చేసుకోవాలి. అప్పుడే స్త్రీ జాతికి కనువిప్పు. సుదర్శనానికి చెప్పేస్తాను — సెమెన్ నెగెటివ్ అని. ఆవేశంతో కుర్చీలోంచి లేచి నిలబడ్డాను. నా ముందు ఎవరో నిలిచి నట్టయింది. ఉలిక్కిపడ్డాను. "ఆవేశపడకు, డాక్టర్! మరొకసారి ఆలోచించు. ప్రాణాల్ని కాపాడవలసిన డాక్టర్‌కు అంత ఆవేశం పనికిరాదు. నీ వృత్తికి వన్నె తెచ్చే గుణమే సహనం. ఆలోచించి చూడు. ఈ సమస్యకు మరణం పరిష్కారం కాదు" అంది ఎదురుగా నిలిచిన నా ప్రతిబింబం.

ఈ అగ్ని భరించడం కష్టమే. విజయ రచయిత్రి. ఆమె ముందు ఈ సమస్య పెడితే ఏం సలహా ఇస్తుందో? చిన్నగా నవ్వుకుంటూ స్టెతస్కోప్ బాగ్‌లో పడేసి, నర్సుని పిలిచి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి ఆదరాబాదరా వచ్చి కారులో కూర్చున్నాడు.

## విజయ

చిత్రమైన సమస్య. చక్కటి అందమైన హోదా గల భర్త. ముత్యాల్లాంటి పిల్లలు. 'కో' అని పిలిస్తే 'ఓ' అని పలికే నౌకర్లు. వడ్డించిన విస్తరి లాంటి జీవితం ఆమెది. అయినా ఆమె తప్పు చేసింది. ప్రాణ సమానంగా ప్రేమించే భర్త ఉండగా ఆమె మరొకరి ప్రేమ కోసం ఎందుకు పాకులాడింది? తప్పు చేయవలసిన అవసరం ఏమిటి?. ఆమెను నేను రక్షించా లంటావా? విజయా! రచయిత్రిగా నీ మేధ ఉపయోగించి నా కో పరిష్కారాన్ని చూపించు" అన్నారాయన. ఆయన ముఖం చూస్తుంటే మానసికంగా ఎంత బాధ పడుతున్నారో సులువుగానే అర్థమయింది. నిజానికి సెమెన్ రిపోర్టు పాజిటివ్ అనడమా? నెగెటివ్ అనడమా? అని కాదనుకుంటాను వారి బాధ. ఆడది ఎందుకు తప్పు చెయ్యాలి? భర్తను ఎందుకు మోసగించాలి? అని ఫీల్ అయిపోతున్నారు. నాకు నవ్వు వచ్చింది. మగవాళ్ళు ఎంత బలహీన మనస్కులు! ఎంత సంకుచితంగా ఆలోచిస్తారు! వాళ్ళు ఎన్ని తప్పులు చేసినా ఫరవాలేదు. ఆడది తప్పు చేస్తే వాళ్ళ గుండెలు బద్దలయి పోతాయి.

మనస్సుకు తోచిన ఏదో ఒక పరిష్కారం చెప్పేసి చేతులు దులుపుకోవచ్చు. కాని, ఆమె ఆ తప్పు చేసేందుకు ఎదురైన పరిస్థితు లేమిటో తెలుసుకోమని నా లోని రచయిత్రి తొందర చేస్తుంటే ఆయన దగ్గర సుదర్శనం అడ్రెస్ తీసుకుని కారులో బయలుదేరాను. ఎంతో సున్నితమైన ఈ విషయాన్ని ఆమె ముందు ఎలా చర్చించాలని ఆలోచిస్తుంటే నాకంతా అయోమయంగా అనిపించింది. రచయిత్రిగా ఎన్నో సమస్యలకు రకరకాల పరిష్కారాలు చూపించి కథను మలుపు తిప్పగలను కాని ఇది కథ కాదు; జీవితం. అందుకే ఇంత ఆలోచన.

## ఊర్మిళ

అర్ధరాత్రి అవుతున్నా, ఆయన ఇంటికి రాలేదంటే మనస్సులో ఎంత బాధ పడుతున్నారో తెలుస్తూనే ఉంది. ఎక్కడ తిరుగుతున్నారో, ఏమో? డాక్టర్‌గారు గర్భవతినని చెప్పిన దగ్గరి నుంచి చెదురు మదురుగా విసుర్లు విసురుతూనే ఉన్నారు. సెమెన్ రిపోర్టు



వచ్చిన తరవాత జరిగే దేమిటో నాకు తెలుసు. చినబాబు పుట్టిన ఆరు నెలల వరకు నా అంత అదృష్టవంతురాలు మరెవరూ ఉండరనే అనుకున్నాను. నాకీ అదృష్టాన్ని ప్రసాదించిన భగవంతుడికి చేతులు జోడించి నమస్కరించడం పోయి గర్వ పడ్డాను. నాకీ అందమే నా భర్తను నాకు బానిసగా చేసిందని పొంగి పోయాను. 'గర్వం పతనానికి నాంది' అన్న సత్యాన్ని మరిచిపోయినందుకు దేవుడు నాకు తగిన శిక్ష విధించాడు. లేకపోతే ఎప్పుడూ ఇల్లు కదలని అక్క పేరంటానికి వెళ్ళడ మేమిటి? అన్ని తలుపులూ వేసుకుని కాని స్వంత ఇంట్లో కూడా చీర కట్టుకోని నేను బాత్‌రూమ్ తలుపులు దగ్గిరికి వేసుకుని స్నానం చేయడమేమిటి? తల్లి దండ్రులు లేక పోయినా, కన్నతండ్రిలా ప్రేమగా చూసిన బావకు నేను అప్సరసలా కనుపించడం నా దౌర్భాగ్యం కాకపోతే మరేమిటి?

పిచ్చిగా ఏడుస్తున్న నన్ను చూసి, అక్క—'ఏడుస్తున్నావేం?' అని అడిగితే 'ఆయునను చూడాలనిపించిం దక్కా! మా ఇంటికి వెళ్ళి పోతాను' అని అబద్ధం ఆడాను ఆ నాడు. అవును మరి. కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది.

ఆ సంఘటనను శత విధాల ప్రయత్నించి మరిచి పోతున్న ఈ సమయంలో ప్రకృతి నా మీద ఈ విధంగా దెబ్బ కొడుతుందని కలలో కూడా అనుకోలేదు. విధి అంటారు దీనినే ఏమో? 'నా శరీరం అపవిత్రం. అయినా మనస్సు మీదే. మీ రే శిక్ష విధించినా నేను సంతోషంగా స్వీకరిస్తాను' అని ఆ నాడే ఆయన పాదాల మీద పడి అరిస్తే, పరిస్థితి ఎలా ఉండేదో? ఆయన అనురాగం కోల్పోతానేమో నన్న స్వార్థంతో ఈ నిప్పును ఇన్నాళ్ళూ నా మనస్సులో దాచుకున్నాను. నిజం బయట పడే సమయం వచ్చినా, ఈ గుండె బద్దలయి పోదేం? డాక్టర్‌గారు రిపోర్టు ఇచ్చాక ఆయన ముఖం ఎలా చూడను? అసలు నేను పతితనని తెలిస్తే ఆయన బ్రతుకుతారా? తప్పు చేసిన ఆడదాన్ని ఎంగిలి విస్తరాకును చూసినట్లు చూస్తుంది లోకం. ఆయన లోకానికి భయపడక పోవచ్చు. కాని, మనస్సు చేసే చిత్రవధకు తట్టుకోలేరని నాకు తెలుసు. సినిమాలో అటువంటి సన్నివేశాలు చూస్తున్నప్పుడు ఆయన ముఖంలో కనుపించే అసహ్యం నాకు పరిచితమే ఈ నిజం తెలిశాక ఆయన పిచ్చివారైనా అయిపోతారు. ఆత్మహత్య అయినా చేసుకుంటారు. అమ్మ బాబోయ్. అనాథ పిల్లలతో, విధవనై ఈ లోకంలో జీవించే కంటే ఆయనకు ఈ నిజం తెలియక ముందే నేను చచ్చిపోతే? పిల్లల్ని ఏ లోటూ లేకుండా ఆయన పెంచగలరనే పూర్తి విశ్వాసం నాకు ఉంది. ఈ జీవితానికి చావు ఒక్కటే గతి. అదే ఈ సమస్యకు పరిష్కారం అనుకుంటే నా మనస్సు తేలిక పడింది.

## విజయ

సౌందర్యానికి ప్రతీక ఆమె. ఆడవాళ్ళనే మోహింప జేసే అందం మగవాళ్ళను కవ్వింప జేయడంలో ఆశ్చర్యం లేదు. కాని, స్వపర భేదం తెలియనంత మోహ దృష్టి మగవాడికి పనికిరాదంటాను. విచక్షణా జ్ఞానం లేని పురుషుడు బ్రతికినా ఒకటే, చచ్చినా ఒకటే. మగవాడిని మార్చి ప్రస్తుతం విపరీతంగా జరుగుతున్న రేప్ కేసులను ఎలా ఆపాలన్నది కాదు నా సమస్య. మగవాడి దౌర్జన్యానికి గురి అయి ఆ పాప భారాని మోస్తూ సుడిగుండంలో చిక్కుకున్న నావలా అల్లాడిపోతున్న ఊర్మిళను ఎలా రక్షించడం అన్నదే నా సమస్య. ఆమె ఆత్మహత్య చేసుకుంటే— ఆమె పసిపాపలు ఏ విధంగా అనాథలై పోతారో, భర్త ఎలా పిచ్చివాడై పోతాడో వర్ణించి చెప్పి, భయపెట్టి ఆమెను ఆత్మహత్యా ప్రయత్నంనుండి విరమింప జేశాను. ఆమె వద్దనుకుంటే—గర్భస్రావం ద్వారా ఆ పాప భారాన్ని ఆమె నుండి వేరు చేయిస్తానని కూడా హామీ ఇచ్చాను. డాక్టర్‌గారితో చెప్పి ఆమె రహస్యాన్ని కాపాడతానని ధైర్యం చెప్పాను. ఆ మెరుపు తీగె కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. కృతజ్ఞతతో నా పాదాలమీద వాలిపోయింది. నా నిర్ణయానికి చంద్రభాను విలువ ఇస్తారని తెలుసు ఒక కాపరాన్ని కాపాడగలిగాను. తృప్తితో నా కనులు చెమ్మగిల్లాయి.

## సుదర్శనం

ఈ ఇరవై నాలుగు గంటల్లో ఎంత నరకం అనుభవించాను! సీతా సావిత్రుల కోవకు చెందిన ఊర్మిళను కొద్ది సేపయినా అనుమానించినందుకు నాలోని ప్రతి అణువూ సిగ్గు పడుతూంది. చంద్రభాను నవ్వుతూ రిపోర్టు అందించినప్పుడే నా తల సిగ్గుతో వాలిపోయింది. 'ఇన్ని సంవత్సరాలూ ప్రేమనూ, స్నేహభావాన్నీ అందజేసిన ఊర్మిళను అర్థం చేసుకోలేక పోయావా?' అన్న హేళన ఆ నవ్వులో నాకు కనుపించింది. ఏది ఏమైనా నా జీవన సహచరి, నా ఆత్మ, నా ప్రాణం, పవిత్రురాలు—తులసీదళ మంత పవిత్రురాలు—అనుకుంటే నా మనస్సు సంతోషంతో గంతులు వేస్తూంది నా చిన్న నాటి ప్రాణ మిత్రుడైన సముద్రుడికి ఈ వార్త చెప్పాలి.

నా ఆనందంలోనూ, కష్ట సుఖాలలోనూ పాలు పంచుకునే నా మిత్రునికి ఈ వార్త చెప్పేసి, మెరుపు వంటి నడకతో ఇంటిదారి పట్టేను. మెత్తటి ఇసుక నా పాదాల క్రింద పూల పాన్పులా ఉంది. నా వెనక సముద్ర ఘోష చక్కటి సంగీతంలా వినిపిస్తూంటే మెరుపు తీగె వంటి ఊర్మిళ రూపం నా కనుల ముందు ప్రత్యక్షమయింది.

## పాఠకుడు

ఆహా! అబద్ధ మాడైనా ఒక కాపరాన్ని నిల బెట్టగలిగేసిన డాక్టర్ చంద్రభాను, అతనికి అంత చక్కటి సలహా ఇచ్చేనని ఆత్మానందం పొందే డాక్టర్ గారి భార్య రచయిత్రి విజయ, డాక్టర్‌ను పూర్తిగా నమ్మి తన భార్య పవిత్రురాలని సంతోష పడిపోయే సుదర్శనం, భర్త ముందు, ప్రపంచం ముందు తల వంచ నవసరంలేని ఊర్మిళ—అందరూ మహా సంతోషాలతో కలకాలం వరి ల్లేలా చేయడమే నా ఈ కథకోని పరమార్థం? నేరాన్ని కప్పిపుచ్చడం వల్ల అవినీతి ప్రబలిపోతుందని రచయిత్రికి తెలియదా? నేరానికి శిక్ష పడాలి. సంఘంలో ఊర్మిళ బావల్లాంటి చీడ పురుగుల్ని ఏరి పారేయాలి. నిప్పు వంటి నిజాన్ని భరించి అమాయకురాలైన ఊర్మిళ వంటి నిర్దోషుల్ని క్షమించగలిగే దృఢ మనస్తత్వం, మానవత్వం పడుగురిలోనూ పెంచగలగాలి. అంతేకాని, అబద్ధ మాడి ఎంత మంది కాపరాలు కాపాడగలరు—చంద్రభాను వంటి డాక్టర్లు?

## రచయిత్రి

అవును. సమాజం ఎత్తుకు, ఇంకా ఎత్తుకే ఎదగాలి. ప్రతి వరాయి స్త్రీలోనూ తన తల్లి, చెల్లినీ పురుషుడు దర్శించే స్థితికి రావాలి. ఒక వేళ తప్పు జరిగినా, శంకించి హింసించకుండా అర్థం చేసుకునేటంత ఉదాత్తత ప్రతి మనిషి పొందగలగాలి. అప్పుడే సంఘం మహాడు పువ్వులా అతు కాకుండాగా పరిఢవిల్లుతుంది. అంతవరకూ సంఘంలో రేప్‌లు జరుగుతూనే ఉంటాయి. ఊర్మిళ వంటి అమాయకులు బలి అయిపోతూనే ఉంటారు. పాఠకుడు కోరుకునే టటువంటి సమాజం ముస్ముందు ఏర్పడక పోదు. అంతవరకూ అమాయకులను రక్షించేందుకు డాక్టర్లు అబద్ధాలు ఆడకా తప్పదు. అమాయకుల్ని రక్షించకా తప్పదు. ★

# బాల ప్రతిభ

చదువుల్లో, సంగీత, నృత్యాది కళల్లో, క్రీడలలో ఉత్తమ బహుమతులు గెలుచుకున్న బాల బాలికల ఫొటోలను, వారిని గురించిన విశేషాలను పంపిస్తే "బాల ప్రతిభ" శీర్షిక క్రింద ప్రచురిస్తాం

\- ఎడిటర్